విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 14, సెప్టెంబర్ 2023

అవినీతికి కేరాఫ్ అడ్రస్ వైసీపీయే

- దీక్షకు మద్దతుగా నిలిచిన సీపీఐ
- నిరాహార దీక్షలో మాజీన ఎమ్మెల్యే బీసీ

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల : అవినీతికి కేరాఫ్ అడ్రస్.. అవినీతితో పుట్టిన పార్టీ వైసీపీ ప్రభుత్వమని, ఈ ప్రభుత్వ దుర్మార్గ చర్యలు పరాకాష్టకు చేరాయని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో చంద్రబాబు అక్రమ అరెస్టుపై టీడీపీ శ్రేణులతో ఉదయం 10 నుండి సాయంత్రం 5గంటల వరకు కలిసి బీసీ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు నేతలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు నాటి టీడీపీ ప్రభుత్వం సిమెన్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని రాష్ట్రంలో 48 కేంద్రాలను ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతకు నైపుణ్యలలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించిందన్నారు. ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండా దీనిలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును అన్యాయంగా అర్ధరాత్రి అరెస్ట్ చేసిందన్నారు. సైకో లాంటి వ్యవస్థతో యుద్ధం చేస్తున్నామని ప్రజలు కలిసి రావాలన్నారు. తమ శ్రేణులను లక్ష్యం చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ భయ పెడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌పై ప్రజల తిరుగు బాటు మొదలైందని, తరిమికొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. లోకేష్ చేపట్టిన యువగలం పాదయాత్రకు విశేష స్పందన రావడంతోనే ప్రభుత్వం భయాందోళనచెంది అక్రమ కేసులతో తెగబడుతుందని దుయ్య బట్టారు. పోలీసులు నిజాయితీగా వ్యవహరించాలని హితవు పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ మాజీ ఎమ్మెల్యే బీసీకి నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. దీక్షలో మండల అధ్యక్షులు రామేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మండల యువనాయకులు హుస్సేన్ రెడ్డి, నంద్యాల ప్రసాద్, నాయకులు కృష్ణ రంగారెడ్డి, బెజ్జం భాస్కర్ రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, జయలక్ష్మి రెడ్డి, వివేకా, బొట్టు స్వామి, బెలుం హుస్సేనయ్య,అందే రాము, ఇటిక్యాల శివారెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ సంఘీభావం :

తెలుగుదేశం పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సీపీఐ, ఏఐటీయుసీ నాయకులు సంఘీభావం తెలిపారు.సీపీఐ నాయకులు సూర్య నారాయణ ఏఐటీయూసీ మండల ఉపాధ్యక్షుడు మహేష్, కార్యదర్శి రామకృష్ణ, అగ్రిగోల్డ్ అసోసియేషన్ సభ్యులు అనిల్ కుమార్, సుధాకర్ తదితరులు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బీసీకి సంఘీభావం తెలిపారు.బాబుకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని ప్రజలు త్వరలోనే గుణపాఠం చెప్పడం తథ్యమని వారు హెచ్చరించారు.

త్వరలో వైసీపీ గంగలో కలవడం తథ్యం : ధర్మవరం సుబ్బారెడ్డి

విశాలాంధ్ర – డోన్ రూరల్ : రానున్న కాలంలో అధికార వైసీపీ అధికార దాహంతో విర్రవీగుతోందని ఆపార్టీ అధికారం 6 నెలల్లో గంగలో కలవడం ఖాయమ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సుబ్బారెడ్డి జోస్యం చెప్పారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ చేసి రిమాండ్ పంపడంపై బుధవారం డోన్‌లోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. మండలం పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల అధ్యక్షులు రామసుబ్బయ్యల అధ్యక్షతన దీక్షలో పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణతో కలిసి ధర్మవరం సుబ్బారెడ్డి నిరాహారదీక్ష దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు అధికార దాహంతో విర్రవీగుతున్నారని వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నిరసనలో శ్రీరాములు, ఇంచార్జ్ సుధాకర్, యూనిట్ ఇంచార్జ్ రామేష్, జిల్లా రైతు సోషల్ మీడియా మెంబర్ రాజశేఖర్ రెడ్డి, ఇంచార్జ్ బాలు, మాజీ సర్పంచ్ మద్దిలేటి, డోన్ మండల మైనార్టీ కమిటి నాయకులు రషీద్, దేవరబండ శ్రీనివాసులు, మాజీ ఎంపిటీసి నారాయణ,బీసీ కమిటీ నాయకులు దేవరబండ మధు గౌడ్, దేవరబండ లక్ష్మణ్‌గౌడ్, సత్యం రాజు, తెలుగుయువత కమిటీ నాయకులు సుధాకర్, ఎల్లయ్య, నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు టి.ఈ.వెంకట నారాయణ గౌడ్, క్లస్టర్ ఇంచార్జ్ గోవిందు. కొచ్చెరువు నాగన్న, ఉంగరానిగుండ్ల మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటికి ప్రజాపాలన

విశాలాంధ్ర – వెలుగోడు : జగనన్న ప్రభుత్వం ప్రజల ముంగిటికి పాలన తెచ్చిందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. వేల్పనూరులో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నూతనంగా వేల్పనూరులో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం -1, రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నూతనంగా మంజూరైన సచివాలయము -1,2 లో 26 కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. నాయకులు అంకిరెడ్డి, ఎంపీటీసీ జనాభా రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తు ముందుకు సాగారు.ఏదైనా సమస్యలుంటే తక్షణమే అధికారులను పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేస్తూ ఎమ్మెల్యే పర్యటన కొనసాగింది.కార్యక్రమంలో తహశీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో అమానుల్లా, హౌసింగ్ ఏ.ఈ.శ్రీనివాసులు, ఆర్.డబ్ల్యు.ఎస్. ఏ.ఈ. పక్కీరయ్య, విద్యుత్ ఏ.ఈ.రవీంద్రనాయక్, పంచాయతీరాజ్ ఏ.ఈ. శ్రీనివాసులు, నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రారంభం

విశాలాంధ్ర – బనగానపల్లె : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల కోసం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ డిస్పెనర్సరీని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులకు వారంలో ఆరు రోజుల్లో ప్రతినిత్యం ఒక విభాగం వారు ప్రభుత్వ ఉద్యోగులకు విశ్రాంతి ఉద్యోగులకు వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. అలాగే డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ప్రతినిధులతో ఆరోగ్య మిత్రా లు ప్రజలకు ఎటువంటి సేవలు అందిస్తున్నారని ఈ సందర్భంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్స్ బృందానికి ,సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో నియోజవర్గ సంఘం అధ్యక్షుడు నల్లగట్ల శ్రీనివాసులు, సెక్రెటరీ అల్తాఫ్ హుస్సేన్ ,జాయింట్ సెక్రెటరీ దాదావలి, ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ సుజాత, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాలతోనే మానసికోల్లాసం

బాల్ బ్యాట్మెంటన్ విజేత కొణిదెల జట్టు

విశాలాంధ్ర- నందికొట్కూరు : క్రీడాలు మానసిక వికాసానికి దోహదపడతాయని సర్పంచ్ రవియాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బిజినవేములలో సర్పంచ్ రవి యాదవ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ సభ్యురాలు కల్లిమున్నిసా, మండల అధ్యక్షులు మురళి కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు పబ్బతి జ్యోతి రవికుమార్ లు హాజరై పోటీలు ప్రారంభించారు. పోటీలకు మండల స్థాయిలోని పాఠశాలల విద్యార్థులు పోటా పోటీగా నువ్వా నేనా అన్న రీతిలో క్రీడా స్ఫూర్తి చాటడం జరిగింది.

అండర్ -17 బాల్ బ్యాట్మెంటన్ విజేతగా కొణిదెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందగా వారికి సర్పంచ్ రవి యాదవ్ ఆధ్వర్యంలో బహుమతిగా కప్పును అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్‌బాబు, క్రీడా విభాగం సెక్రెటరీ శ్రీనాథ్ పేరు మల్ల, నంద్యాల షాప్ కోఆర్డినేటర్ స్వామి దాసు రవికుమార్, మండల స్థాయి విద్యార్థులు, విద్యార్థినీలు, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా విచారణకు సిద్ధపడాలి - ఎమ్మెల్యే గంగుల

విశాలాంధ్ర-చాగలమర్రి :స్కిల్ డెవలప్మెంట్ స్కాం (నైపుణ్యాభివృద్ధి) కుంభకోణం కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిజాయితీ పరుడైతే తనకు తానే సీఐడీ విచారణకు సిద్ధపడాలని శాసనసభ్యులు గంగుల బిజెంద్రారెడ్డి పేర్కొన్నారు.బుధవారం ముత్యాలపాడులో ఎంపీటీసీ వెంకటరాముడు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందే నన్నారు. అనుభవం ఉన్న నాయకులు విచారణకి సిద్ధపడాలే కానీ, నేరాన్ని అంగీకరించకుండా నోటీసులు ఇవ్వలేదు, నాలుగేళ్ల తర్వాత అరెస్టు చేశారని కుంటి సాకులు చెబుతున్నారని ఆరోపించారు. రాష్ట్రమంతా ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తే ఏమి ఒరుగదన్నారు. 2021 లో స్కిల్ డెవలప్మెంట్ అథారిటీ పెట్టిన కేసుపై ప్రభుత్వానికి రుద్దడం సరైంది కాదన్నారు. త్వరలోనే లోకేష్, అచ్చం నాయుడు మరో ఇద్దరు బడా నాయకులు సిఐడి ఉచ్చులో ఇరుక్కునే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.తనపై ఆళ్లగడ్డ ఇసుక అక్రమ రవాణా పై ఆరోపణలు నిరూపిస్తే ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కేంద్ర ప్రభుత్వం జమిలిఎన్నికలు నిర్వహిస్తే వైసీపీ అందుకు సిద్ధంగా ఉందన్నారు. ఏ ఎన్నికల కైనా ఎప్పుడైనా తాను రెడీగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో వైసీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు వీరభద్రుడు, ఉప మండల అధ్యక్షుడు ముల్లా రఫీ, సర్పంచ్ శంకరమ్మ భాయ్ తబ్బిబ్బు (బాబు) పవన్ కుమార్ గౌడ్ వరికూటి సుబ్బరాయుడు, సుబ్బన్న, రెహమాన్, చాంద్ బాషా, దస్తగిరి, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

అనిశాకి పట్టుబడ్డ వీఆర్వో ..వెంకట రమణారెడ్డి

- లంచము తీసుకుంటూ పట్టుబడిన వైనం
- అవినీతిపై ముందే హెచ్చరించిన 'విశాలాంధ్ర'

విశాలాంధ్ర -మిడుతూరు : నిజాయితీగా పనిచేయాల్సిన విఆర్వోలు ఒక ప్రైవేటు ఇంటిని అద్దెకు తీసుకొని విచ్చలవిడిగా లంచాలు తీసుకుంటూ ఏసీబీకి అధికారులకు చిక్కిన సంఘటన మండల కేంద్రమైన మిడుతూరు లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజవర్గ పరిధిలో గల మిడుతూరు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు భవనంలో మండల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వీఆర్వోలు అద్దెకు తీసుకొని ఉంటూ అక్రమ కార్యకలాపాలకు తెరలేపారు. మండలంలోని జలకనూరు గ్రామ విఆర్ఓ వెంకటరమణారెడ్డి, వెంకట రమణయ్య అనే రైతు దగ్గర రూ.7 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుపడ్డాడు. ఏసీబీ డి.ఎస్.పి వెంకటాద్రి మాట్లాడుతూ జలకనూరు గ్రామానికి చెందిన రైతు వెంకట రమణయ్య తన కున్న మూడెకరాల పొలాన్ని తన కుమార్తెలకు రిజిస్టర్ చేయించి ఇచ్చాడు. ఆన్లైన్లో తన కూతుర్ల పేర్లను ఎక్కించాలని విఆర్ఓను అడగగా అందుకు రూ.50వేలు లంచం డిమాండ్ చేశాడు. అందుకు ఒప్పుకొని రైతు రూ.10వేలు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. మొదటి విడతగా రూ.3 వేలు కొద్దిరోజుల క్రితం ఇచ్చాడు. మిగిలిన రూ. 7 వేలు బుధవారం ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చి విఆర్ఓకు ఇవ్వబోతుండగా ఏసీబీ అధికారులు తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నా మని డిఎస్పి తెలిపారు. ఎవరైనా అవినీతికి పాల్పడుతుంటే అలాంటి వారి సమాచారం తమకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డి.ఎస్.పి వెంకటాద్రి వెల్లడించారు.

పోలింగ్ బూతుల పరిశీలన

విశాలాంధ్ర – పాములపాడు : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూతులను ఆత్మకూర్ డివిజన్ తహశీల్దార్ దాస్,తహశీల్దార్ రత్న రాధిక పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తుమ్మలూరు, కృష్ణరావుపేట, జూటూరు, రుద్రవరం, పాములపాడు, ఎర్రగూడూరు, చెలిమిల్ల,ఎలక్ట్రోల్ బూతులను సందర్శించి, పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. వీరివెంట మండల సర్వే భాస్కర్, వీఆర్వో కళిముల్లా, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ : అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని మండల కన్వీనర్ బుద్దా చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సచివాలయంలో ఈనెల రెండో విడతలో మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల సిఫారసు కావాలని, ఈ ప్రభుత్వంలో వాలంటీర్లు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి అర్హత కలిగి ఉన్నారని గుర్తిస్తే అలాంటి వారికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. మండలానికి నూతనంగా 212 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

నందికొట్కూరు : మండల పరిధిలోని దామగట్ల, బిజినవేముల, అల్లూరు గ్రామాల్లో రెండో విడత కింద నూతనంగా మంజూరు అయినటువంటి వైయస్సార్ పెన్షన్ కానుకను ఆయా గ్రామాల సర్పంచులు మాధవరం సుశీలమ్మ, రవియాదవ్,నాయకులు అల్లంపూర్ రవి బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ రహీం, రవీంద్ర బాబు, చంద్రశేఖర్ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి : మండలం లోని శెట్టివీడు గ్రామంలో కొత్త పింఛన్లు బుధవారం పంపిణీ చేశారు. గ్రామంలోని సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవి, వైసీపీ నాయకురాలు రాధికలు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల,మతాలకు,పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిదే అన్నారు. ఈకార్యక్రమంలో విద్యా కమిటి చైర్మన్ జమాల్ వలి, చిన్న భికారి, వెల్ఫేర్ సహాయకులు సుధాకర్, కార్యదర్శి సుజాత , వాలంటీర్లు,తదితరులు పాల్గొన్నారు.

నంది అవార్డుకు చిత్రకారుడు ఎంపిక

విశాలాంధ్ర -నందికొట్కూరు : నియోజకవర్గ కేంద్రమైన నందికొట్కూరు మాజీ కౌన్సిలర్ చిత్ర కళాకారుడు దేశెట్టి శ్రీనివాసులు జాతీయ బంగారు నంది అవార్డుకు ఎంపికైయినట్లు బుధవారం ఆయన విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ వారు నిర్వహించిన చిత్రలేఖనంలో ఉత్తమ ప్రతిభా కనబరిచి, తాను గీచిన చిత్రానికి బంగారు నంది అవార్డుకు ఎంపికైయినట్లు తెలిపారు. ఈ అవార్డును ఈ నెల 17న హైదరాబాద్ రవీంద్రభారతిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్, వల్లూరి ఫౌండే షన్ చైర్మన్ విఆర్ శ్రీనివాసరాజు చేతుల మీదుగా బహుమతి ప్రధానం ఉంటుందన్నారు. గతంలోనూ తనకు చిత్రలేఖనంలో 40 వరకు అవార్డులు వచ్చాయని, చిన్నారులకు 250కి పైగా గోల్డ్, సిల్వర్ మెడల్స్ వచ్చాయన్నారు. ఇటువంటి వారిని ప్రభుత్వం వారు గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తతోనే వ్యాధులు దరిచేరవు

విశాలాంధ్ర – నందికొట్కూరు : సీజనల్ వ్యాధుల పట్ల పశువుల యజమానులు జాగ్రత్త వహించి వాటిని చూసుకోవాలని ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కోనేటమ్మ పల్లె గ్రామంలో పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ చిడ పా రోగం టీకాల కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా టీకాలు వాటి ప్రాముఖ్యత ప్రతి గొర్రె, మేకకు గుర్తింపు కోసం వాటి చెవులకు 12 అంకెల నెంబర్ వేయడం గురించి ఎంపీపీ రైతులకు తెలిపారు. నందికొట్కూరు సహాయ సంచాలకులు డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ పశువర్ధక శాఖలో ప్రస్తుతం 50 శాతం సబ్సిడీతో మిశ్రమ దానమృతం, అందుబాటులో ఉందని గడ్డి కోసే యంత్రం 25 శాతం సబ్సిడీతో రూ. 20,382 లకే అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దామోదర్ రెడ్డి, పశు వైద్యాధికారులు షణ్ముఖి, రాజు రైతులు పాల్గొన్నారు.

సంక్షేమానికే అధిక ప్రాధాన్యం

విశాలాంధ్ర-బేతంచెర్ల రూరల్ : వైసీపీ ప్రభుత్వం సంక్షేమానికే అధిక ప్రాధాన్య మిస్తోందని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు.బుధవారం స్థానిక 7 వ వార్డు కోటపేటలో గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తూ, సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కళ్ళతో ముందుకు వెళ్తున్నామన్నారు.ఇంటింటికి మంచి నీళ్ల ఇచ్చేందుకు కృషి, రింగ్‌రోడ్డు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత విషయంలో రాజీ పడేది లేదన్నారు. కార్యక్రమంలో కమిష నర్ రమేష్‌బాబు, మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఖాజా హుసేన్, ఉర్దూ యూనివర్సిటీ కమిషన్ సభ్యులు మూర్తుజవలి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్థల వితరణ అభినందనీయం

పాణ్యం-విశాలాంధ్ర: మండల పరిధిలోని మజారా గ్రామం అహల్యపురం దళితుల స్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసు కున్న కొత్తూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రధానార్చకులు నాగపుల్లయ్య శర్మ, సావిత్రమ్మ, వీరయ్య శర్మ, నాగ లక్ష్మమ్మలు బుధవారం స్థల వితరణ చేశారు. దాతలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ గత కొన్నేళ్ళుగా స్మశాన వాటిక లేకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులను చలించి మానవత్వంతో లక్షలాది రూపాయలు విలువ చేసే అరెకరం భూమిని అనుపూరు గ్రామానికి చెందిన కంపమల్ల వంశీయులు ఉచితంగా రిజిస్ట్రేషన్ పత్రాలు ఎమ్మెల్యే కాటసాని చేతుల మీదుగా వారికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని గడప గడపకు మన ప్రభ త్వం కార్యక్రమం మద్దూరు, అహల్యపురం, అనుపూరు గ్రామాలలో నిర్వ హించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని దీవించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు.

ప్రకృతి వ్యవసాయంతోనే లాభాలు

విశాలాంధ్ర -మిడుతూరు : ప్రతి ఒక్క రైతు పంటలు సాగు చేసి, అధిక లాభాలు సాధించాలంటే అది ఒక్క ప్రకృతి వ్యవసాయం తోనే సాధ్యమని నందికొట్కూరు ఏరియా కో-ఆర్డినేటర్ దేగలయ్య పేర్కొన్నారు. వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్న చెరుకుచెర్ల గ్రామానికి చెందిన షెడ్యూల్ కులాలకు చెందిన 61 మంది రైతులకు ప్రధాన మంత్రి అనుసూచిత జాతీయ అభ్యుదయ పథకం విత్తన కిట్లు మంజూరయ్యాయి. ఈ కిట్లను సర్పంచ్ మరియమ్మ చేతుల మీదుగా బుధవారం విత్తన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం వెలుగు ఏపిఎం సుబ్బయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటతోనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈవిధంగా పండించిన దిగుబడులకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందన్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుందని సూచించారు. గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో రైతులు, సీసీ కృష్ణారెడ్డి, వ్యవసాయ ఎంపీఈవో మౌలాలమ్మ, విహెచ్ఏ మద్దిలేటి, మాస్టర్ ట్రైనర్ స్వామి, ఐసీఆర్‌పీలు దోరతి, సరస్వతి, కిరణ్‌కుమారిలు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు చరిత్ర హీనులుగా మిగిలిపోతారు

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెయిల్ పై బయటికి వచ్చేంతవరకు తమ పోరాటము ఆగదని.. మరింత ఉధృతం చేస్తామని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని అఖిలప్రియ స్వగృహం వద్ద బాబుకి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం కార్యక్రమంలో భాగంగా రిలే నిరాహార దీక్షల శిబిరంలో యువ నాయకులు జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవరామ్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిలప్రియ మాట్లాడుతూ నంద్యాలలో రాత్రి అక్రమంగా చంద్రబాబును అరెస్టు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు, లోకేష్ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో జీర్ణించుకోలేక కక్ష సాధించేందుకు వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై కేసు పెట్టారన్నారు. రూ. 43 కోట్లు ఖర్చుపెట్టి ప్రత్యేక విమానం తీసుకొని లండన్ పోవడానికి మాత్రం ముఖ్యమంత్రి జగన్‌కు నిధులు ఉంటాయి కానీ గ్రామాలు అభివృద్ధి చేయడానికి మాత్రం నిధులు ఉండవని విమర్శించారు. బాబు బయటకు వచ్చేంతవరకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపి దీక్షలలో పాల్గొనాలని మాజీ మంత్రి పిలుపు నిచ్చారు. అవసరమైతే రాజమండ్రి జైలు వద్దకు కూడా తరలి వెళ్లి నిరసన తెలిపేందుకు కూడా సిద్ధమవాలని పేర్కొన్నారు.

మిడుతూరు : చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆయనపై కుట్ర పడిన వారికి పుట్టగతులు ఉండవని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గిత్త జయసూర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రమైన మిడుతూరులో చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా నంద్యాల పార్లమెంటు మాజీ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, నంద్యాల పార్లమెటు ఇంచార్జ్ మాండ్రా శివా నంద రెడ్డి ఆదేశాల మేరకు సామూహిక నిరాహార దీక్ష కార్య క్రమం మండల అధ్యక్షులు కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టి మద్దతు తెలిపారు.

జగన్ దుర్మార్గ పాలనకు రోజులు దగ్గర పడ్డాయి



విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : ముఖ్యమంత్రి జగన్ దుర్మార్గ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో అది అక్షర సత్యమని నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ జోస్యం చెప్పారు. మండల కేంద్రంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఆయన తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే జగన్ తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు.

నూతన పెన్షన్లను పంపిణీ

విశాలాంధ్ర – జూపాడుబంగ్లా : మండలంలోని పారుమంచాల సచివాలయంలో సర్పంచ్ ప్రకాశం చేతుల మీదుగా బుధవారం లబ్ధిదారులకు నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి నూతనంగా 31 పింఛన్లు మంజూరు అయ్యాయన్నారు. అర్హులను గుర్తించి వారి పేర్లు నమోదు చేయాలని వాలంటీర్లకు సూచించారు.

ఆయిల్ ఫామ్ సాగు పద్ధతులపై అవగాహన

విశాలాంధ్ర – వెలుగోడు : ఆయిల్ పామ్ పంట సాగు చేస్తే రైతులు అధిక లబ్ధి పొందుతారని ఆత్మకూరు డివిజన్ వ్యవసాయ అధికారి ఆంజనేయులు అన్నారు. వెలుగోడు ఎంపీడీవో కార్యాలయంలో ఆయిల్‌ఫామ్ సాగు, పద్ధతులు, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్‌కి ఉద్యాన శాఖ ద్వారా ఎన్ఎంఈఓ పథకం కింద కేంద్రం 60 శాతం , రాష్ట్రం 40 శాతం ప్రకారం మూడేళ్ల పాటు మొక్కలు, ఎరువులకు ఈక్రాప్ బుకింగ్ అనుసరించి రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు తమ అనుమానాలు నివృత్తి చేసుకొనుటకు పశ్చిమగోదావరి జిల్లాలో సాగు చేసిన ఆయిల్‌ఫామ్ పంట, పరిశ్రమను నేరుగా సందర్శించడానికి క్షేత్ర సందర్శన కల్పించాలని కోరడంతో అందుకు ఆయిల్ ఫామ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మల్లేశం అంగీకరించారు. ఆసక్తి కలిగిన రైతులు రైతు భరోసా కేంద్రంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కొత్తూరు సుబ్బరాయుడికి తగ్గిన ఆదాయం

విశాలాంధ్ర- పాణ్యం : ప్రముఖ శైవ క్షేత్రం మండల పరిధిలోని ఎస్.కొత్తూరు శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సంబంధించిన తలనీలాల వేలం బుధవారం ఈ- బహిరంగ వేలంలో కడపజిల్లా మైదుకూరు పట్టణం సాయినాథపురంకు చెందిన వెంకటేశ్వర్లు రూ.36.25,500ల కోట్‌చేసి దక్కించుకున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టెండర్, సీల్డ్ టెండర్ బహిరంగ వేలం నిర్వహించగా ఈ టెండర్‌లో ఎవరూ పాల్గొన లేదని, ఈ- బహిరంగ వేలంలో అవుకుకు చెందిన వెంకటేశ్వర్లు కేవలం రూ.18.40 లక్షలకు పాట పాడగా, వెంకటేశ్వర్లు రూ.36,25,500 లకు దక్కించుకున్నారని తెలిపారు. గతేడాదితో పోలిస్తే రూ.5,84,500 లు తక్కువగా వచ్చినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాలు ఏడాదికి పోగు చేసుకొనుటి హక్కు ను వెంకటేశ్వర్లు పొందినట్లు ఈఓ వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శశికుమార్, కృష్ణారెడ్డి, శివరామిరెడ్డి, సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, వేలం పాటదారులు తదితరులు పాల్గొన్నారు.

Name of Change

I GANACHARI KRISHNA CHAITHANYA (old name) S/o RAJA PULLAIAH GANACHARI,H.No.3-207,Byrmalstreet, Nandyal - 518501, Nandyal Dist. A.P. hereby state that I have changed my name GANACHARI KRISHNA CHAITHANYA (old name) TO GANACHARI KRISHNA CHAITANYA (new name) and known as GANACHARI KRISHNA CHAITANYA.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు,గురువారం 14, సెప్టెంబర్ 2023

క్లాప్ డ్రైవర్లకు బకాయి జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : గ్రేడ్-1 ఎమ్మిగనూరు మున్సిపాల్టీల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నియామక మైన క్లాప్ డ్రైవర్లకు 4 నుంచి నెలల జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో క్లాప్ ఆటోలకు 2 రోజుల నుండి పెట్రోల్ లేక పాత మున్సిపల్ లో నిలిపిన క్లాప్ఆటోల ముందు నిరసన వ్యక్తం చేయడం జరిగిందని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు యు.వీరేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న రెడ్డి ఏజెన్సీస్ ను డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మినూర్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 11 మంది క్లాప్ డ్రైవర్లు ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమంలో సేవలందిస్తున్నారన్నారు. వీరి నియామకాల సందర్భంగా నెలకు రూ.15 వేల జీతం ఇస్తామని కాంట్రాక్టర్లు చెప్పారని,ఇప్పుడు రూ.9 వేల నుంచి రూ.13 వేలలోపు మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. రెడ్డి ఏజెన్సీస్, క్లాప్ మిత్ర వాహనాల మధ్య జరిగిన ఒప్పందంలో క్లాప్ డ్రైవర్లకు చట్టబద్ధంగా జీతభత్యాలు, సెలవులు అమలు చేస్తామని అంగీకరించినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. క్లాప్ మిత్ర వాహనాలకు రిపేర్లు వచ్చినా కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. వాహనాలు మరమ్మతులకు గురవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రమాదాలకు క్లాప్ డ్రైవర్లను బాధ్యులను చేసి రూ. వేలల్లో జరిమానాలు వేస్తున్నారన్నారు. క్లప్ ఆటో డ్రైవర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లేకపోయినా నెలకు పీఎఫ్ కింద 1450 జీవితంలో కట్ చేయడం జరుగుతుందని ఈ డబ్బు ఎక్కడ వెళుతుందో అర్థం కాని అయోమయో పరిస్థితిలో క్లాప్ ఆటో డ్రైవర్ ఉన్నారని వారు తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి క్లాప్ డ్రైవర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలనీ లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ ,సీపీఐ మండల కార్యదర్శి బిటి చిన్నాన్న, నాయకులు రవి,రోషన్, నరసింహులు,లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు దుర్మార్గం...

దీక్షలకు సీపీఐ సంఘీభావం

దీక్షా శిబిరంలో సంఘీభావం తెలియచేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య , జగన్నాధం, అవులశేకర్ , రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడును వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్ష్యతో అక్రమ కేసులు పెట్టి అరెస్టుచేయడం దుర్మార్గమని టీడీపీ కర్నూలు పార్లమెంట్అధ్యక్షులు బీటీ నాయులు విమర్శించారు. బుధవారం టీడీపీ రాష్ట్ర సమితి ఆదేశాల మేరకు నగరంలోని దర్నాచౌక్ వద్ద నిరాహారదీక్షలు చేపట్టారు. టీడీపీ కర్నూలు నియోజకవర్గం ఇన్చార్జి టీజీ భరత్ ఆద్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు బీటీ నాయుడు , మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌లు సంఘీభావం తెలియచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పె డుతూ జైళ్ళలో పెడుతున్నారన్నారు.సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కరువైందని వాక్‌స్వాతంత్ర్యం లేకుండా పోయిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలు తగిన సమయంలో ప్రభుత్వంకు బుద్ధిచెపుతారని హెచ్చరించారు.దీక్షలలో టీడీపీ నాయకులు జేమ్స్, మధు, తిరుపాల్‌బాబు, మధు, ముంతాజ్, సుఖన్య దేవి, అబ్బాస్‌తోపాటు టీడీపీ నాయకులు ఉన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షకు అందరూ కలపి పోరాటం చేద్దాం... పీ.రామచంద్రయ్య

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అరాచకాలు పెరిగిపోయాయన్నారు. ఒక్కసారి అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత రాష్ట్రం పేరు చెడకొడుతున్నాడన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడును అర్థరాత్రి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అరెస్టుచేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య హక్కులను జగన్ కాలరాస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ ముందుగానే రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి అనే నినాదంతో విశాఖపట్నం నుండి తిరుపతి వరకు బస్సుజాత నిర్వహించిందన్నారు. వైసీపీ నేతలు భూములు, ఇసుక కొల్లకొడుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబునాయుడును అరెస్టు చేయడం వలన ఆయన గ్రాఫ్ పెరిగిపోయిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరూ కలసి పనిచేయాలని పిలుపు నిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో 17వ తేది అన్ని జిల్లాలో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని పిలుపు నివ్వడం జరిగిందన్నారు. అరెస్టుపై జాతీయ స్థాయిలో నాయకులు కూడా తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కలసి రావాలని , జగన్ పాలకు అంతం పలకాలని, జగన్‌ను గద్దెదించే వరకు అందరూ కలికట్టుగా పోరాటం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. సంఘీభావం తెలి యచేసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, ఏపీ వ్యవసాయకార్మికసంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఆవుల శేఖర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె జ గన్నాధం, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మహేష్, సోమన్న తదితరులు ఉన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు గండి..

విశాలాంధ్ర - హొళగుంద : హొళగుంద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును 20 కోట్ల రూపాయలతో అధికారులు నిర్మించారు. ఎల్ఎల్సీ దిగువ కాలువ నీటిని మళ్లించి మరికొన్ని గ్రామాలకు త్రాగునీటి సరఫరాను అధికారులు రోజు విడిచి రోజు చేస్తున్నారు. ట్యాంక్ నుండి పైపు ద్వారా నీటి సరఫరా చేసే వారు ట్యాంక్ నుండి పైపు పగిలిపోవడంతో ఎస్ఎస్ ట్యాంకు నుండి భారీగా నీరు ప్రవహించి వృధా అవుతుందని ప్రజలు ఆరోపించారు. రోజుల తరబడి నీరు ప్రవహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకో వడంలేదని ప్రజలు వాపోయారు.నీరు వృధాగా ప్రవహించిపంట పొలాల్లోకి పారీ అపార నష్టం కలిగిందని రైతులు పేర్కొన్నారు. నీరు ప్రవహించడం వల్ల పత్తి పంట నష్టం కలిగిందని రైతులు పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ ఏఈ రాంనీలను వివరణ కోరగ మండలానికి కొత్తగా వచ్చానని గురువారం వెళ్లి చూసి సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించండి

విశాలాంధ్ర - కౌతాళం : కౌతాళం పంచాయతీ కార్మికులకు గత నాలుగు నెలల నుండి వేతనాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారికి వెంటనే వేతనాలు చెల్లించాలని సిపిఐ మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల సర్పంచ్ తో చర్చించగా వారం పది రోజులలో వేతనాలను చెల్లిస్తామని అన్నారు.ముఖ్యంగా తాగునీటి సరఫరా లో అంతరాయం కలుగుతుందని ప్రజలు వాపోతున్నారు. తాగునీటి విషయంలో నాయకులు అధికారులు శ్రద్ధ తీసుకోవాలని. తాగునీటి విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో సుధా నారాయణమూర్తి

విశాలాంధ్ర - మంత్రాలయం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాల యం రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై ఇన్ఫోసిస్ అధినేత సుధానారాయణమూర్తి కుటుంబ సమేతంగా మంత్రాలయంకు చేరుకున్నారు వీరికి మఠం అధికారులు స్వాగతం పలికారు వీరు మొదటగా గ్రామ దేవత మాంచాలమ్మను దర్శించుకుని తదనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వీరికి మఠం ప్రస్తుత పీఠాధిపతి బూదేంద్ర తీర్థులు ,శేష వస్త్ర ఫలపుష్ప రాఘవేంద్ర స్వామి మేమేంటోను ఇచ్చి ఆశీర్వదించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

విశాలాంధ్ర-దేవనకొండ: 17 బాక్సులు (1632 టెట్రా పాకెట్స్ 90 యంఎల్)కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని పాలకుర్తి గ్రామసమీపంలో కారులో వెళ్తుండగా అనుమానంతో పరిశీలించగా ఐదుగురు వ్యక్తులు ఉన్నారని వారంతా అమ్మేందుకు మద్యని అక్రమంగా తరలిస్తుండంతో వారిపై కేసు నమోదు చేసినట్లు, ద్విచక్ర వాహనంపై బాక్సులు తరలిస్తుండగా మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ పంపిన్నట్లు తెలిపారు.

మండల స్థాయి క్రీడలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - మంత్రాలయం : ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించ తలపెట్టిన మండల స్థాయి అండర్ 14,17 క్రిడలను విజయవంతం చేయాలని ఎంఇఓ రాఘున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో 14 - 17 ఏళ్ల వయసు గల విద్యార్థిని విద్యార్థులకు మండల స్థాయిలో క్రిడా పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి టిటిడి బోర్డు సభ్యులు వై సీతారామిరెడ్డి పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ మండల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 15 వ తేదీన జరిగే వాలీబాల్, కోకో, కబడ్డీ, యోగ, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ త్రోబాల్, టెన్నీకాయిట్ మొదలైన అథ్లెటిక్స్ లో మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి ఇంచార్జీ విశ్వనాథ్ రెడ్డి గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య మండల ఉపాధ్యక్షులు పులికుక్క రాఘవేంద్ర జెడ్పీటీసీ మజ్జిగ గోవిందమ్మ ఉప సర్పంచ్ హొటల్ పరమేష్ స్వామి యంపిటిసి జి. వెంకటేష్ తదితరులు పాల్గొంటారని మరిన్ని వివరాలకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బసవరాజు, పిఇటి నరసింహరాజు లను ఈ ఫోన్ నెంబర్లతో సంప్రదించగలరని తెలిపారు. పిడి ,పిఇటి సెల్ నెంబర్లు 9703036442, 9573077213 గా గమనించగలరు.

CHANGE OF NAME

Name change (Old name) KAMALE MALLIKARJUNA H.NO.24/123,ADONI NEWS NAMEKAMALAY MALLIK ARJUNA H.NO . 24/123 , ADONI

ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఇళ్ళ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం మండల స్పెషల్ ఆఫీసర్ లు, ఎంపీడీఓ లు, తదితరులతో హౌసింగ్, రీ సర్వే, ఉపాధి హామీ, ఎలక్షన్స్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ కు సంబంధించి ఇళ్ళ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కోడుమూరు, ఆదోని, వెల్దుర్తి మండలాల్లో ఇళ్ళ నిర్మాణాల్లో పురోగతి తక్కువగా ఉందని, వేగవంతం చేయాలని కలెక్టర్ ఎంపిడిఓ, ఏ ఈ లను ఆదేశించారు. పురోగతి చూపని మండలాలకు సంబంధించిన అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.రీ సర్వే కి సంబంధించి స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ లో కోడుమూరు, ఓర్వకల్, వెల్దుర్తి మండలాల్లోని గ్రామాలు నిర్దేశించిన లక్ష్యాల కంటే తక్కువ చేస్తున్నారని సంబంధిత తహసిల్దార్లను కలెక్టర్ ప్రశ్నించారు. సెప్టెంబర్ 15 సాయంత్రం నాటికి కచ్చితంగా స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఉపాధి హామీ పనులకు సంబంధించి చెత్త సంపద తయారీ కేంద్రాలకు సంబంధించి బిలో బేస్మెంట్ లెవెల్ స్థాయిలో కోడుమూరు, పెద్దకడబూరు మండలాలలో పెండింగ్ లో ఉన్నాయని, పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఎలక్షన్స్ కి సంబంధించి పెండింగ్ లో ఉన్న ఫార్మ్స్, జంక్ క్యారెక్టర్స్, డెలిషన్స్ నిర్దేశించిన గడువు లోపు పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్ కి సంబంధించి ఏఈఆర్ఓ లు పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే సమావేశాలకు రాజకీయ పార్టీ ప్రతినిధులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూతింగ్ కి సంబంధించి ఒక్క రోవర్ కి ఒక టీమ్ 100 ఎకరాలు చేసే విధంగా లక్ష్యాన్ని కేటాయించడం జరిగిందని, ఖచ్చితంగా నిర్దేశించిన లక్ష్యాలు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్లో ఇంఛార్జి హౌసింగ్ పిడి సిద్ధలింగ మూర్తి, పంచాయతీరాజ్ ఎస్ ఈ సుబ్రహ్మణ్యం, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు ఇవ్వాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : ఎరువులు కొనుగోలు చేయడానికి వచ్చిన రైతులకు ఈపాస్ యంత్రం ద్వారానే ఎరువులను ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ అన్నారు. బుధవారం సి.బెళగల్ మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగుమందులు, మరియు విత్తన దుకాణా దారులతో మండల వ్యవసాయ అధికారి కార్యాలయము నందు వ్యవసాయ అధికారి జీ మల్లేష్ కుమార్ఎరువుల గురించి డీలర్లతో సమావేశాన్ని నిర్వహించి కొన్ని ముఖ్యమైన సూచనలు చేయడం జరిగింది. రైతులకు దుకాణా దారులు నాణ్యమైన ఎరువులను మరియు పురుగుమందులను అందించాలని ప్రతి షాపు నందు మీ దుకాణం యొక్క లైసెన్సు మరియు షాపులలో ఉన్నటువంటి స్టాకు నిల్వల స్టాక్ బోర్డులను కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. అదేవిధంగా రైతులు షాపుల యందు కొనుగోలు చేసిన ప్రతిదానికి తప్పకుండా రసీదులు ఇవ్వాలని ముఖ్యంగా రైతులు ఎరువులను కొనుగోలు చేయడానికి వచ్చినప్పుడు ఈపాస్ యంత్రం ద్వారా మాత్రమే ఎరువులు ఇవ్వాలని ఆయన డీలర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తో పాటు ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, ఏ ఈ ఓ సిద్దు మరియు మందుల షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర -హొళగుంద : మండలంలోని ఇంగళదహాల్ జడ్పీ హైస్కూల్లో జరిగిన మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో హొలగుంద జడ్పీ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు అండర్ 14 అండర్ 17 క్రీడా పోటీల్లో పాల్గొని గెలుపొందారని హెడ్మాస్టర్ ఎస్ ఎండి నజీర్ అహ్మద్ బుధవారం తెలిపారు. పరుగు పందెం ,వాలీబాల్ ,కబడ్డీ, పోటీల్లో విద్యార్థులు గెలుపొందారని అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని అన్నారు గెలుపొందిన విద్యార్థులను హెడ్మాస్టర్ ఎస్ ఎం డి నజీర్ అహ్మద్ ,ఉపాధ్యాయులు ఫర్హద్ బేగం,తిప్పేస్వామి ,పిడి మహబూబ్ బాషా అభినందించారు.

చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామికం

విశాలాంధ్ర - నెట్ వర్క్ : తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్మెంట్ (నైపుణ్యాభి వృద్ధి) కార్పొ రేషన్ కుంభకోణం కేసులో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు 14 రోజుల పాటు జ్యూడిషియల్ కస్టడీ రిమాండ్ విధించడాన్ని పార్టీ శ్రేణులు నిరసిస్తూ బాబు తో నేను దీక్షల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. వైకాపా దుర్మార్గ చర్యలు పరాకాష్టకు చేరాయని పార్టీ శ్రేణులు ధ్వజమెత్తాయి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై పార్టీ శ్రేణులు మండిపడ్డారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసన వ్యక్త చేశాయి. రిలే నిరాహార దీక్షల్లో టిడిపి పార్టీ శ్రేణులు అభిమానులు ఉదయం 10 గంటల నుండిసాయంత్రం 5గంటల వరకు నిరాహార దీక్షల్లో పాల్గొన్నారు.

కోసిగి లో

ఆదోని లో

హొళగుంద లో

ఆదోని రూరల్ లో

కౌతాళం లో

సి.బెళగల్ లో

టిడ్కో గృహాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : పట్టణ మున్సిపల్ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాలకు కనీస మౌలిక సదుపాయాలు త్రాగునీరు విద్యుత్, డ్రైనేజ్ కల్పించి అర్హులైన లబ్ధిదారులను టిడ్కో గృహాల్లో చేర్చడం లో మున్సిపల్ అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారని బుధవారం నాడు సీపీఐ ఆధ్వర్యంలో శివనగర్ లో నిర్మించిన టిట్కో గృహాలను సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, సీపీఐ నాయకులు భాస్కర్ యాదవ్,బీటీ.చిన్నాన్నలు పరిశీలించారు.ఇప్పటివరకు1120 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలు ఇచ్చిన వారిని గృహాల్లోకి చేర్చడంలో మున్సిపల్ అధికారులు చేతులెత్తేయడం జరిగిందని,ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజాధనం వృధా కాకుండా టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయం కల్పించి లబ్ధిదారులను చేర్చాలని లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు వీరేషు,సీపీఐ నాయకులు నరసింహులు, విజయేంద్ర,రవి, మునుస్వామి,రోషన్, రామలింగడు,ఖాదర్ సమీర్,కృష్ణ,మల్లికార్జున వీరేష్,బోయ రవి,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ అనుమతులు పొందాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : పట్టణంలోని శ్రీనివాస్ భవన్ హొటల్ నందు ఆంధ్ర ప్రదేశ్ హొటల్ అసోసియేషన్ కమిటీ సమావేశం కార్యదర్శి వీరేష్ నాయకత్వంలో అధ్యక్షులు బసన్న గౌడ్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఫుడ్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్,లైసెన్స్ రిజిస్టర్ అధికారి అల్తాఫ్ హుస్సేన్, హొటల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్,ఆదోని గౌరవాధ్యక్షులు కేబీ.రాజు ఫాస్ట్ ట్రాక్ ట్రైనర్ యశోద దేవి,సింధు,మోహన్ బాబు పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి ఫుడ్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి హొటల్ యాజమాన్యం ఫుడ్ లైసెన్స్,ఫాస్ట్ ట్రాక్ లైసెన్స్, లేబర్ లైసెన్స్ తప్పకుండా పొందాలని,హొటల్,రెస్టారెంట్, దాబా,బేకరీ, టీ స్టాల్ నందు శుభ్రత పాటిస్తూ వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. హొటల్లో కుకింగ్ చేసే మాస్టరు ఆరోగ్యంగా ఉంటూ ప్రజలకు మంచి ఫుడ్ అందిస్తూ ప్రతి ఒక్కరు తప్పకుండా ఫాస్ట్ ట్రాక్ లైసెన్స్ పొందాల్సి ఉందని తెలియజేశారు. పలు విషయాలు సూచనలు ఇస్తూ హొటల్ నిర్వాహకులకు ఈ సమావేశంలో సింధు అవగాహన కల్పించారు.కోశాధికారి ప్రవీణ్ కుమార్,సోమశేఖర్ అసోసియేషన్ సీనియర్ మంజునాథ్, ఆవకాయ్ హొటల్ శ్రీనివాస్,రెనుకంబ హొటల్ రాజు స్వామి పాల్గొన్నారు.

గ్రామ సేవకుడి కుటుంబానికి అండగా ఉంటాం

విశాలాంధ్ర - మంత్రాలయం : మంత్రాలయం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన వీఆర్ ఏ నరసన్న మంగళవారం రాత్రి మాధవరం గ్రామ శివారులోని బాట మారెమ్మవ్వ గుడి వద్ద ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా ఎద్దుల బండి ని ఢీ కొని అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని నరసన్న మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. సుంకేశ్వరి గ్రామంలో అనారోగ్యంతో అయ్యమ్మ మృతి చెందింది. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈయనతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, ఏఎస్ఐ బందెనవాజ్, సర్పంచ్ ముక్కరన్న, వైఎస్సార్సీపీ నాయకులు రోగప్ప, రవి రెడ్డి, బొజ్జప్ప, నారయణ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పై అవగాహన

విశాలాంధ్ర -పెద్దకడబూరు: మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు బుధవారం ఇంచార్జీ ఎంపీడీఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఏఎన్ఎంలకు, ఎంఎల్ హెచ్పీ, వాలంటీర్లకు సర్వే పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో మండల వైద్యాధికారిని శాంతిజ్యోతి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్ హెచ్పీ, వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 15 రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి గుండె, కిడ్నీ, క్యాన్సర్, పక్షవాతం, డెంగ్యూ, మలేరియా, బీపి,షుగర్ వంటి వ్యాధులపై సర్వే నిర్వహించాలన్నారు. ఈ నెల 31 నుంచి గుర్తించిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏఏ వైద్య పరీక్షలు, ఎలాంటి మందులు, ఎలాంటి పరికరాలు అవసరం తదితర తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి జనార్ధన్, సిహెచ్ఓ కృష్ణ మోహన్,ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్పీ, వాలంటీర్లు పాల్గొన్నారు.